క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపులపూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం భక్తులతో ఆలయ ప్రధాన అర్చకుడి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు ముడుపుల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ లోకకళ్యాణార్థం జరుగుతున్న ముడుపుల పూజలకు దూరప్రాంతాలనుంచి వందలాది మంది భక్తులు హాజరవుతున్నారని తెలియజేశారు. అలాగే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూకట్టి కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పాచిపెంట: మండల కేంద్రంలోని దనాన వీధిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని నిలుపుదల చేయాలని కోరుతూ పలువురు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ డి.రవికి వినతిపత్రం అందజేశారు.

ఎంపీడీవోగా ఎంఎల్ఎన్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

పాచిపెంట: పాచిపెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంఎల్ఎన్ ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంఎల్ఎన్ ప్రసాద్ ఇంతవరకు సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై పాచిపెంట ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్‌కు పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

30 మద్యం బాటిల్స్ స్వాధీనం

సాలూరు: పట్టణంలోని డీలక్స్ సెంటర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, డీలక్స్ సెంటర్ వద్ద రూట్ వాచ్ చేపడుతుండగా స్కూటీలో తరలిస్తున్న 30 మద్యం బాటిల్స్‌ను పట్టుకున్నామని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, స్కూటీ సీజ్ చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు: శ్యామలాంబ పండగ నేపథ్యంలో విద్యుత్ పనుల్లో భాగంగా శుక్రవారం పట్టణం, మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.11 కేవీ టౌన్-1,టౌన్-2 11కేవీ పాలిటెక్నిక్ ఫీడర్‌ల పరిధిలో గల ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామన్నారు. చెట్ల కొమ్మల కత్తిరింపు తదితర పనులు చేపట్టనున్నామని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

- ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చితే గాలి కలుషితం
- ప్రజారోగ్యానికి తీవ్రనష్టం

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు



బలిజిపేట-చిలకలపల్లి మార్గంలో చెత్తను అంటించడంతో వస్తున్న పొగ

బలిజిపేట:

ప్లాస్టిక్ వినియోగంతో ప్రజాజీవితాలకు పెనుముప్పు కలుగుతుందని నెత్తినోరు కొట్టుకుంటూ ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. ప్లాస్టిక్ వాడకంతో తీవ్ర అనారోగ్యాలు కలుగుతాయని వినియోగం నిషేధించాలని చెబుతున్నారు. వాడకాన్ని నిషేధించడం పక్కన పెట్టి వాటిని తగలబెడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనావాసాలనుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడు, మద్యం షాపులు, కిళ్లీబడ్డీలు, జ్యూస్‌స్టాల్స్, హోటళ్ల నుంచి ప్రతినిత్యం టన్నుల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఇవన్నీ డంపింగ్ యార్డుల్లా రోడ్డు పక్కకు చేరుతున్నాయి. అక్కడ వాటికి నిప్పు అంటించి కనిపించకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తద్వారా వాతావరణంలో అత్యంత విషపూరిత కలుషితాలను నేరుగానే కలుపుతున్నారని చెప్పవచ్చు.

ప్రచారానికే పరిమితం

తడిచెత్త, పొడిచెత్త అంటూ ప్రచారానికి మాత్రమే పరిమితమవుతున్న యంత్రాంగం ఆ తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి చెత్త ద్వారా ఎరువులను ఉత్పత్తి చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న అధికారులు పొడి చెత్తను ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పొడి చెత్తలో అత్యధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలేనని, వాటిని తగులబెట్టి చేతులు దులిపేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై ఆంక్షలు ఉన్నప్పటికీ, ఆయా వస్తువుల వినియోగం మాత్రం విచ్చలవిడిగా సాగుతోంది. అలా వినియోగించిన వస్తువులు మొత్తం డంపింగ్ యార్డుల్లా ఉన్న రోడ్ల పక్కన, కాలువల్లో చేరుతున్నాయి. వాటిని ఏదోవిధంగా కాల్చేస్తున్నారు. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందనే భయాందోళన వ్యక్తమవుతోంది.

కలుషితం కానున్న గాలి

నిత్యం వినియోగిస్తున్న ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్లు, కవర్లు తదితరాలైన వ్యర్థాలను వదిలించుకునేందుకు నిప్పుపెట్టడాన్నే ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 50కంటే తక్కువగా ఉంటేనే ఆ గాలిని పీల్చుకోవడం ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. అయితే డంపింగ్ యార్డుల్లా కనిపిస్తున్న రోడ్ల పక్కన ప్లాస్టిక్‌ను తగులబెట్టే ప్రాంతాల్లోనూ ఈ ఏక్యూఐ 70 నుంచి 119వరకు ఉంటుందని అంటున్నారు. సాధారణంగా ప్రతి మొబైల్‌లోనూ ఈ ఏక్యూఐని చూపించే యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా పరీక్షిస్తే గాలి నాణ్యత అంశం తెలుస్తుందని పలువురు తెలియజేస్తున్నారు. గాలి నాణ్యత ప్రమాదకరంగా మారడానికి చెత్తను తగులబెట్టడమే ప్రధాన కారణమని పలువురు చెబుతున్నారు.

చెత్తకు నిప్పు పెట్టవద్దని చెబుతున్నాం

పొడిచెత్త, వ్యర్థాలకు ఎక్కడా నిప్పు పెట్టవద్దని సిబ్బందికి సూచిస్తున్నాం. రోడ్డు పక్కన చెత్త వేయవద్దని తెలియజేస్తున్నాం. అలా వేసిన చెత్తకు నిప్పు పెట్టడం వల్ల ప్రమాదముందని తెలియజేశాం. గ్రామాల్లో తడిచెత్త, పొడి చెత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బందికి తగు సూచనలు అందిస్తున్నాం. దీనిని పరిశీలించి చర్యలు చేపట్టనున్నాం

– పుష్పారావు, ఈఓపీఆర్‌డీ, బలిజిపేట

ప్రతిభతోనే ఉన్నత అవకాశాలు



ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

పార్వతీపురంటౌన్: క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఆర్‌సీఎం కార్యాలయ సముదాయం ఆవరణలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయి వేసవి క్రీడా శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. చదువులో మొదటి స్థానంలో నిలిచిన విధంగానే క్రీడల్లో కూడా జిల్లా ఖ్యాతిని ఇనుమడించాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యం పెంపొందించుకొనేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయ పడ్డారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడలను తిలకించారు.

50 కేంద్రాల్లో శిక్షణ

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో గల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మౌలిక సదుపాయాలు కలిగిన 50 కేంద్రాల వద్ద 18 క్రీడా అంశాల్లో నైపుణ్యం కలిగిన శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులతో తర్ఫీదు ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమలో జిల్లా విద్యాశాఖ అధికారి రమాదేవి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.మురళీకృష్ణ, అంతర్జాతీయ బాక్సర్, అర్జున్ అవార్డు గ్రహీత సీరా జయరాం, ఆర్పరీ జిల్లా కార్యదర్శి డీటీ గాంధీ, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు తదితరులు, పాల్గొన్నారు.

క్రీడా కోటా అమలుపట్ల హర్షం



వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మంతిన వాసు దేవరావు నాయుడు

పార్వతీపురం టౌన్: రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఉద్యోగాల్లో క్రీడాకోటాను రెండుశాతం నుంచి మూడు శాతానికి పెంచడం ,పెంచిన కోటాను తక్షణమే మెగా డీఎస్సీలో అమలు చేయటం పట్ల మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మంతిన వాసుదేవరావు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ క్రీడా కోటా ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు తరగతి గదిలో కూడా విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించి మరెందరో క్రీడాకారులకు తయారు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. క్రీడా కోటలో ఉద్యోగం వచ్చిందని విద్యార్థులకు కూడా చదువుతోపాటు క్రీడలు అవసరం అని ఉపాధ్యాయులు ధైర్యంగా చెప్పి వారిని తరగతిగది నుంచి క్రీడామైదానం వైపు చూసే విధంగా అడుగులు పడనున్నాయన్నారు. అదేవిధంగా అన్ని ఉద్యోగాల్లో కూడా నూతన క్రీడాకోటాను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో ఉండే క్రీడాకారులకు ఇది ఒక సువర్ణవకాశమని, ఉద్యోగ భద్రత లభిస్తుందని ఆనందం వెలిబుచ్చారు.

వేసవిలో పశువులకు నీటి తొట్టెలు వినియోగించాలి



పరిశీలిస్తున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వేసవిలో పశువులకు ఏర్పాటు చేసిన తాగునీరు తొట్టెలను పాడిపశువులున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. కొత్తవలస, రామవరం, పెదభోగిలి గ్రామాల్లో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు రామవరంలో పశువుల నిమిత్తం చిర్మాణం చేసిన నీటితొట్టెను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్లు నిర్దేశించిన గడువులోగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరారు. వేసవిలో పశువులకు తాగునీరు అవసరముందని, వాటి నీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామానికి ఒక మంచినీటి తొట్టె నిర్మాణం జరిగిందని తెలిపారు. పంచాయతీ పాలకులు, పశువులున్న రైతులు మంచినీటి తొట్టెలో నీరు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఆయాగ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలి



ఫారంపాండ్ పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్యామల, ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: ఇళ్ల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.శ్యామల సూచించారు. ఈ మేరకు మక్కువలోని హౌసింగ్ లేఔట్‌ను, గురువారం ఎంపీడీవో డీడీ స్వరూపారాణితో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి ఇంటి నిర్మాణ పనుల ప్రగతిని పరిశీలించి, అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల వివరాలును హౌసింగ్ ఏఈ సింహాచలాన్ని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మార్కొండపుట్టి గ్రామంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.అలాగే గ్రామంలో ఉపాధి పథకం నిధులతో నిర్మాణం చేపడుతున్న ఫారంపాండ్ పనులు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణ కార్యక్రమం సక్రమంగా అమలుచేయాలని ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడారులో దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

పార్వతీపురం రూరల్: దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రారంభమైన ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏఎంఓ డి.సూర్యనారాయణతో కలిసి అడారు పంచాయతీలో గల గేదెగుమ్మి వలస గ్రామంలో స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలో ఇంటింటికి దోమల మందు పిచికారీ చేస్తున్న తీరును గమనించారు. ఇళ్లల్లో గల అన్ని గదుల్లోనూ పిచికారీ జరగాలని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పిచికారీ పూర్తయిన ఇళ్లకు మార్కింగ్ తప్పనిసరిగా వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.కౌశిక్, సబ్‌యూనిట్ అధికారి ధనుంజయ, ఎంటీఎస్ రామకష్ణ, సూపర్‌వైజర్ కష్ణంరాజు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు అందని పింఛన్లు

పార్వతీపురం రూరల్: ఇటీవల భర్తలు మృతి చెంది వితంతువులైన వారికి ఈ నెల ఒకటో తేదీ నుంచి పింఛన్లు మంజూరు చేస్తామని కుటమి ప్రభుత్వం చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం కనబడలేదు. ఈ మేరకు వితంతువుల పెన్షన్ కోసం పార్వతీపురం మండలంలోని 125 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారికంగా మండల పరిషత్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం ప్రతినెల 10,662 మంది లబ్ధిదారులకు గాను సుమారు 4.5 కోట్ల రూపాయలను పెన్షన్ సొమ్ముగా విడుదల చేస్తోంది. అయితే ఈ నెలలో కూడా గత నెల మాదిరిగానే పెన్షన్ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసింది తప్ప కొత్తగా వితంతువుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంకా అనుమతులు గాని ప్రభుత్వం నుంచి నిధులు గానీ రాలేదు. గురువారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శతశాతం పూర్తయినట్లు జిల్లా ఉన్నతాధికారులు ప్రకటించేశారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



బలిజిపేట:సీఐటీయు కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేసిన నాయకులు, కార్మికులు

- సాలూరు సివిల్ జడ్జి హర్షవర్ధన్
- జిల్లాలో ఘనంగా మేడే వేడుకలు



సాలూరు: మాట్లాడుతున్న సాలూరు సివిల్ జడ్జి హర్షవర్ధన్

సాలూరు: కార్మిక చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సాలూరు సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. కార్మికదినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మోటార్ కార్మికులకు ప్రమాదం జరిగినప్పుడు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌తో పాటు కుటుంబపోషణ నిమిత్తం బాధిత పరిహార చట్టం ఉందని వివరించారు. ఏదైనా న్యాయ సహాయం కోసం మండల న్యాయసేవా సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సిఐ అప్పలనాయుడు, న్యాయవాదులు సంఘం అధ్యక్షులు జగన్నాథం, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: పతాకావిష్కరణ చేస్తున్న ఆర్.ఈశ్వరరావు

ఎగిరిన ఎర్రజెండా..!

లక్షలమంది శ్రమజీవుల రక్తతర్పణం, వందలమంది బలిదానాల నుంచి ఆవిర్భవించిన అరుణోదయం కార్మికదినం. గురువారం మేడే సందర్భంగా జిల్లావ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన మేడే కార్యక్రమాల దృశ్యాలు ఇలా ఉన్నాయి.



పార్వతీపురం: సుందరయ్య భవనం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు



పార్వతీపురం: నాలుగు రోడ్ల కూడలివద్ద మేడే వేడుకలు చేస్తున్న సీఐటీయూ నాయకులు



పార్వతీపురం: జిల్లా ఆస్పత్రి సమీపంలో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ కార్యదర్శి కుమార్



మక్కువ: దుగ్గేరులో మేడే పండుగ జరుపుకుంటున్న రైతు కూలీ సంఘం నాయకులు



సీతానగరం: ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘ ప్రతినిధులు



సాలూరు: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు



మక్కువలో జెండా ఎగురవేస్తున్న కలాసీలు

నిర్లక్ష్యపు నీడలో విద్యుత్ శాఖ



విద్యుత్ ప్రమాదంతో మృతి చెందిన ఆవులు

- తరచూ విద్యుత్ ప్రమాదాలు



పది రోజుల క్రితం దగ్ధమైన లారీ

పాచిపెంట:

కరెంట్ తీగలు యమపాశాల్లా మారుతున్నాయి. పాచిపెంట మండలంలో తరచూ ఎక్కడో ఒక చోట విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాటికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధితులు ఎంతమొత్తుకుంటున్నా వారి తీరు మాత్రం మారడం లేదు. తాజాగా ఇలాంటి సంఘటనలే మండలంలో రెండు చోట్ల సంభవించాయి. ఈదురుగాలుల బీభత్సానికి విద్యుత్ తీగలు తెగిపడ్డాయని ఆ శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో మండలంలోని కొటికిపెంట పంచాయతీ గోగాడవలస సమీపంలో మట్టపర్తి సురేష్ అనే రైతుకు చెందిన మూడు మూగజీవాలు బుధవారం విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. మూడు రోజుల క్రితం తెగిపడిన విద్యుత్ తీగలను సరిచేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతు సురేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే పది రోజుల క్రితం కేరంగి పంచాయతీ నందేడు వలస సమీపంలో విద్యుత్ వైర్లు తగిలి ఓ లారీ పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదానికి సంబంధించి విద్యుత్ వైర్లు కిందకు ఉన్నాయని పలుమార్లు ఆయా పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని స్వయంగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా..



విద్యుత్ శాఖ అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాను. నా మూడు పశువుల మృతికి సంబంధించిన లైన్‌మన్ గోపీని సంప్రదించాను. ఆవుల మృతికి తనకు సంబంధం లేదని దిక్కున్న చోట కంప్లైంట్ ఇచ్చుకోమంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడాడు.

– రైతు మట్టపర్తి సురేష్